# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. భారతదేశం అభివృద్ధి మార్గంలో వేగంగా పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2. చిత్తూరు జిల్లా కుప్పంలో ఏర్పాటు కానున్న 7 పరిశ్రమలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారు.**

**3. శేషాచలం అటవీ ప్రాంతంలో అరుదైన వృక్ష, వన్యప్రాణులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**

**4. సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా సమాజ చైతన్యానికి భక్త కనకదాసు ఎంతో కృషి చేశారని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొనియాడారు.**

**5. పేదల ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు.**

==========================

భారతదేశం అభివృద్ధి మార్గంలో వేగంగా పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. వందే భారత్ రైళ్ల అనుసంధానంతో నగరాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. వందే భారత్, నమో భారత్, అమృత్ భారత్ తదితర రైళ్లు నూతన తరం భారతీయ రైల్వేలకు పునాది వేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొంటూ...

వాయిస్ .. 27 సెకన్లు

-------------------------

చిత్తూరు జిల్లా కుప్పంలో ఏర్పాటు కానున్న 7 పరిశ్రమలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 2 వేల 2 వందల 3 కోట్ల రూపాయల పెట్టుబడులతో కుప్పంలో పలు సంస్థలు ఏర్పాటు అవుతున్నాయని అధికారులు తెలిపారు. శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి అక్కడ ప్రజలు, ఆయా సంస్థల ప్రతినిధులతో ఆన్‌లైన్‌లో మాట్లాడుతారు.

-------------------------

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మై భారత్ పశ్చిమగోదావరి జిల్లా అధికారి సుంకర రాము చెప్పారు. భీమవరంలో ఆయన నిన్న ఆకాశవాణితో మాట్లాడారు. ఈ జయంతి ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు సుంకర రాము వెల్లడిస్తూ..

వాయిస్ 31 సెకన్లు

--------------------------

శేషాచలం అటవీ ప్రాంతంలో అరుదైన వృక్ష, వన్యప్రాణులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం మామండూరులోని ఎర్రచందనం గోడౌన్లు, తిరుపతిలోని మంగళంలో ఉన్న ఎర్రచందనం గోడౌన్‌లను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మామండూరు అటవీశాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి, అటవీశాఖ అధికారులతో కలిసి శేషాచలం అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్‌లో అటవీశాఖ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు.

--------------------------

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం వద్ద ఈరోజు రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణిస్తున్న ఒక కారు టైరు పేలడంతో.. అదుపుతప్పి బస్సు షెల్టర్‌లో ఉన్న ఆరుగురుపైకి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

--------------------------

సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా సమాజ చైతన్యానికి భక్త కనకదాసు ఎంతో కృషి చేశారని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఆయన ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా కల్యాణదుర్గంలో భక్త కనకదాసు కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాకు అనేక నీటి ప్రాజెక్టులు తీసుకొచ్చినట్లు చెప్పారు. జిల్లాలో హార్టీకల్చర్‌ను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలుపుతూ..

వాయిస్...30 సెకన్లు

--------------------------

పేదల ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలోని మంత్రి నివాసం వద్ద లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని సంక్షేమ హామీలను అమలు చేసిందని మంత్రి వివరిస్తూ..

వాయిస్.. 27 సెకన్లు

బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలో 81 మంది లబ్ధిదారులకు 49 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను లబ్దిదారులకు చీరాల ఎమ్మెల్యే కొండయ్య అందజేశారు.

---------------------------

భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య టి 20 క్రికెట్ సిరీస్‌లో భాగంగా 5వ మ్యాచ్ ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరం, గాబా స్టేడియంలో ఈ రోజు జరగనుంది. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌ల్లో ఇండియా రెండు, ఆస్ట్రేలియా ఒక మ్యాచ్ గెలిచాయి. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. దీంతో ఇండియా ఈ సిరీస్‌లో 2-1 ఆధిక్యాన్ని సాధించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలో రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్ 25 సెకన్లు

---------------------------

అధికారులు విధి నిర్వహణలో పలు రకాల ఒత్తిడులను ఎదుర్కొంటారని, అటువంటి పరిస్థితుల్లో ఫిట్ ఇండియా ర్యాలీలు ఉత్సాహాన్ని నింపుతాయని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఫిట్ ఇండియా–సైక్లోథాన్‌లో భాగంగా ఐదు కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ ఈరోజు నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి ఎస్పీ అద్నాన్ నయీం అస్మీతో కలిసి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

=====================